క్లుప్తంగా

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

ఓజిలి: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం ఓజిలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారదాదేవి, విద్యా కమిటీ చైర్మన్ అనిత, నాయకులు పాడి వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైదాపురం తహసీల్దార్‌గా సుభద్ర



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్‌గా ఎం.సుభద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఉదయగిరి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమాదేవి మనుబోలుకు బదిలీ అయ్యారు. ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ సుభద్ర తెలిపారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు రూరల్ : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్విమ్స్ వైద్యాధికారి ఎం.జ్యోతి తెలిపారు. గూడూరు మున్సిపాలిటీ చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం తిప్పవరప్పాడు, కొమ్మనేటూరు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా గర్భకోశ, రొమ్ము క్యాన్సర్ వ్యాధులు వస్తున్నట్టు తెలిపారు. రొమ్ము, గర్భంలో గడ్డలు ఉన్నట్టు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జూన్ 16న కొండాగుంట, 17న మేకనూరు, 19న మిట్టాత్మకూరు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సల్మా, లీలా క్రిష్ణ, హరిత, చైతన్య బాను, పాల్ జాన్సన్, సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ క్షేమం కోరుతూ సామూహిక పూజలు

వాకాడు : సమాజ క్షేమాన్ని కాంక్షిస్తూ వారం రోజులుగా వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లోని సాయిబాబా ఆలయాల్లో సామూహిక పూజలు, హారతులు, తత్సంగం, ప్రార్థనలు చేస్తున్నారు. శుక్రవారం వాకాడు, కోటలోని సాయిబాబా ఆలయాల్లో షిరిడీ సాయి అనుబంధ సేవా సంస్థ నిర్వాహకులు, అశేష భక్త బృందాలతో సాయిబాబా తత్సంగం, శాంతి పూజలు, సామూహిక హారతులు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు గంగిరెడ్డి వెంకటరామిరెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తలు విజయలక్ష్మీ, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న దాత, ఉపాధ్యాయులు

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దాతల సహకారంతో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. హెచ్ఎం అనసూయ మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతిలో ముగ్గురు విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారని తెలిపారు. వారిని ప్రోత్సహించేందుకు ఎల్ఐసీ విశ్రాంత డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి నగదు బహుమతి ఇచ్చినట్టు తెలిపారు. 535 మార్కులు సాధించిన జి.నవ్యకు రూ.5 వేలు, 529 మార్కులు సాధించిన టి.తన్వికి రూ.3 వేలు, 525 మార్కులు పొందిన లోహిత్‌కు రూ.2 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్, ఈ మాధవయ్య, దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి, విద్యుల్లత, మధుసూదన్‌రావు, సుబ్రహ్మణేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తడ: మండలంలోని అక్కంపేట గ్రామ సమీపంలో శుక్రవారం రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. అతనికి 25 నుంచి 30 ఏళ్లు ఉంటాయని, నలుపు రంగు జీన్స్ ప్యాంట్, ఎరుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని వద్ద ఈ నెల 9వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పాట్నా జంక్షన్ నుంచి కోయంబత్తూరు జంక్షన్ వరకు తీసుకున్న జనరల్ టికెట్టు లభించిందని వెల్లడించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించామని, వివరాలు తెలిసిన వారు సూళ్లూరుపేట జీఆర్‌పీ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తల్లికి వందనంలోనూ కోతలే

- కొంతమందికే నగదు బదిలీ
- అర్హత ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- సచివాలయాలకు పరుగులు తీస్తున్న తల్లులు



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

చిల్లకూరు : మేము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో నగదు అందజేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మకు వందనం పథకానికి మార్గదర్శకాలు రూపొందించాల్సి వుందని ఏడాది గడిపేశారు. ఇప్పుడు పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపి అర్హత ఉన్న వారికి నగదు బదిలీ చేస్తామని ప్రకటించి తల్లుల ఖాతాలో జమ చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది బిడ్డలు ఉంటే అందరికీ కాకుండా ఉన్న వారికే మొండిచేయి చూపించి కోత విధించారు. చాలా మంది అర్హత కలిగిన వారికి కూడా నగదు బదిలీకాకపోవడంతో విద్యాశాఖాధికారులను కలుస్తున్నారు. వారు తమ బిడ్డకు చెందిన అర్హత ప్రమాణాలు ఉండే ధ్రువీకరణ పత్రాలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేయాలని సూచిస్తున్నారు. తర్వాత వారి పేర్లను నమోదు చేస్తామని చెప్పడంతో సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు.

100 శాతం మందికి అందని హామీ

గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో తల్లికి వందనం పథకం కింద నగదు బదిలీకి సంబంధించి ఇప్పటికే తల్లుల ఖాతాలో నగదు బదిలీ అయింది. గతంలో వచ్చిన వారిలో కొంతమందికి నగదు బదిలీ కాలేదు. దీంతో ఈ ఏడాది తమ పిల్లలకు తల్లికి వందనం వర్తించే అవకాశం ఉందా లేదా అని ఆందోళన చెందుతున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఒక ఇంటిలో ఎంతమంది బిడ్డలు ఉంటే అంత మందికీ పథకం వర్తింపజేస్తామని హామీ ఇవ్వగా నేడు అది పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
గూడూరు పట్టణ, రూరల్‌లో	89	6499
చిల్లకూరు	71	5,220
కోట	72	5113
వాకాడు	72	2945
చిట్టమూరు	95	3,452
వెంకటగిరి నియోజకవర్గంలో..		
వెంకటగిరి	101	7,900
బాలాయపల్లి	76	3,526
డక్కిలి	71	2,986
సూళ్లూరుపేటలో నియోజకవర్గంలో..		
ఓజిలి	61	2,140
పెళ్లకూరు	65	3772
దొరవారిసత్రం	65	3,266
సూళ్లూరుపేట	70	5,180
నాయుడుపేట	75	3524

పలువురికి అందని తల్లికి వందనం

తల్లికి వందనం నిధులు తమ ఖాతాలో జమ అవుతాయని తల్లులు ఆశగా ఎదురు చూశారు. చిల్లకూరు మండలం తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 260 మంది ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు, 50 మంది మూడు నుంచి ఐదు తరగతి విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కరికి కూడా తల్లికి వందనం నగదు బదిలీ కాలేదని తెలిసింది. దీనిపై పాఠశాల హెచ్ఎం వెంకటరమణను వివరణ కోరగా తాను రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టానని తెలిపారు. తల్లికి వందనం నగదు బదిలీ విషయంపై సచివాలయ సిబ్బందిని కలవాలని చెప్పామన్నారు. సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ జరీనాను సంప్రదించగా నగదు బదిలీకి సంబంధించి జాబితాను సచివాలయం వద్ద ఉంచినట్టు తెలిపారు. అర్హత ఉండి పేర్లు లేని వారు వస్తే చూసి మళ్లీ నమోదు చేస్తామన్నారు. అలాగే జాబితాలో ఉన్న వారందరికీ ఒక క్రమంలో నగదు బదిలీ అవుతుందని పేర్కొన్నారు.

వీరికే పథకం వర్తింపు

తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులను తగ్గించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా అనేక నిబంధనలు తీసుకువచ్చింది. కుటుంబ ఆదాయం గ్రామాల్లో ఏడాదికి రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలుగా నిర్ణయించింది. కుటుంబానికి మూడెకరాల్లోపు మాగాణి లేదా పదెకరాల్లోపు డీకేటీ భూమి వుండాలి. అలాగే కరెంట్ బిల్లు ఏడాదిలో 300 యూనిట్లకు తక్కువగా ఉండాలి. విద్యార్థుల హాజరు శాతం 75 శాతానికి తక్కువ ఉండరాదు. టాక్సీ, ట్రాక్టర్, ఆటో, కారు వున్న వారు అనర్హులుగా తేల్చింది.

ఇద్దరు పిల్లలకు ఇవ్వాలి



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. గతంలో అమ్మ ఒడి కింద నా బ్యాంకు ఖాతాలో మొదటి ఏడాది రూ.15 వేలు, రెండో ఏడాది నుంచి రూ.14 వేల చొప్పున జమ అయ్యింది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఎంత మంది బిడ్డలు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఒకరికే రూ.13 వేలు వేశారు. – పదముత్తం వరలక్ష్మీ, ఏరూరు, చిల్లకూరు మండలం

గతంలో ఇచ్చినట్టే ఇస్తున్నారు



గతంలో అమ్మ ఒడి ఒకరికి ఇచ్చారు. నేడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున నగదు బ్యాంకులో జమ చేస్తామని చెప్పారు. ఇప్పుడేమో రూ.13 వేలు ఇస్తామంటున్నారు. నేను మా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాను. ఇద్దరికీ నగదు జమ చేస్తే చదువులకు ఉపయోగపడుతుంది. – శ్రావణి, విద్యానగర్, కోట

13 వేలు ఇస్తామనడం సరికాదు



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 8, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఒక బిడ్డకు మాత్రమే అమ్మ ఒడి వచ్చింది. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇద్దరు బిడ్డలకూ ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో చంద్రబాబు రూ.13 వేలు ఇస్తామని చెప్పారు. ఇద్దరికీ వస్తుందా లేదా అన్న విషయం తెలియడం లేదు. ఇద్దరికీ ఇస్తే చదువులకు ఇబ్బంది వుండదు. – శారదమ్మ, దళితవాద, వాకాడు

సిద్ధవరంలో వైద్యశిబిరం

కోట: మండలంలోని తీరప్రాంత గ్రామం సిద్ధవరంలో శుక్రవారం వల్లిపేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు దినేష్, శివశంకర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జ్వరాలు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది భువనేశ్వరి, నాగమణి, సౌజన్య పాల్గొన్నారు.

బదిలీల్లో ఉపాధ్యాయులు

- స్టాక్ పాయింట్లలోనే విద్యా సామగ్రి
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



స్టాక్ పాయింట్‌లో వున్న విద్యా సామగ్రి

చిల్లకూరు : పాఠశాలలు ప్రారంభం రోజే పిల్లలకు విద్యా సామగ్రి అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆచరణలో విఫలమైంది. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యా సామగ్రి అందజేయలేదు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను పూర్తి చేసి ఎక్కడికక్కడ నియామకాలను పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వ పెద్దల అనాలోచిత నిర్ణయాల వల్ల పాఠశాలలు ప్రారంభమైనా బదిలీల ప్రక్రియ పూర్తికాలేదు. ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలకు సంబంధించిన విద్యా సామగ్రిని తీసుకువెళితే తర్వాత లెక్కలు చెప్పాల్సి వస్తుందని మిన్నకుండిపోయారు. కొత్తగా వచ్చే ఉపాధ్యాయులే విద్యా సామగ్రిని తీసుకువెళ్లాల్సి రావడంతో స్టాక్ పాయింట్లలోనే ఉండి పోయింది.

'తల్లికి వందనం' కాదు వంచన



విలేకరులతో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : నీకు రూ.15 వేలు.. నీకు రూ. 15 వేలు.. నీకు రూ.15 వేలు.. అంటూ ఇంట్లో ఎంతమంది వుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామంటూ ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు తల్లులను వంచించారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలో విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పథకాల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాల నిర్వహణకు రూ.వెయ్యి కేటాయిస్తే గగ్గోలు పెట్టిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు రూ.2 వేలు కోత విధించి రూ.13 వేలు మాత్రమే లబ్ధిదారులకు ఇస్తామని చెప్పడం దారుణమని చెప్పారు. గురువారం నాడే తల్లు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని ప్రకటించారని, వాస్తవానికి ఎప్పుడు ఇస్తారో తెలియని దుస్థితి దాపురించిందన్నారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని, లేకుంటే వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ అప్రజాస్వామికమని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టని తెలిపారు. రాబోయే జమిలి ఎన్నికల్లో కూటమి సర్కార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

చెస్ క్రీడాకారులకు సన్మానం



చెస్ క్రీడాకారులను అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు కే.డమరేషన్, చింతగింజల నైనిక, కీర్తనను వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. వెంకటగిరి వినయ్ చెస్ అకాడమి చైర్మన్ ఇర్రా వినయ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ నారాయణ, నాయకులు సదారెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, రొంటాల చిన్న తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై దర్శనమిచ్చిన శ్రీవారు





సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు, ముసుగుల సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వామి, పద్మావతి అమ్మవార్ల ముసుగుల సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ముఖ ద్వారం వద్ద నిలిపి ఉంచి అమ్మవారిపై అనుమానంతో వైకుంఠానికి రాకుండా అడ్డుకునే సన్నివేశం అందరిని అలరించింది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకంఠిరామోహన్‌రావు, ఈవో రవిక్రిష్ణ చర్యలు తీసుకున్నారు.

రోడ్డు వివాదంపై ఆర్డీవో పరిశీలన



పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు : మండలంలోని శిరసంబేడు గ్రామం మీదుగా అమ్మన్‌ట్రి స్టీల్ పరిశ్రమకు వెళ్లే రోడ్డుపై కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి శుక్రవారం రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని సర్వే నంబరు 149/3లో వేలూరు మురళీకృష్ణారెడ్డికి చెందిన 1.95 ఎకరాల భూమిలో సుమారు 21 సెంట్లలో పరిశ్రమకు చెందిన వాహనాలు రాకపోకల కోసం గతంలో కంపెనీ యాజమాన్యం తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. శాశ్వత రోడ్డు నిర్మాణం కోసం కోల్పోతున్న భూమికి పరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు బాధితుడు విన్నవించారు. పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వన్‌బీ, అడంగల్‌లో పేర్లు మార్చారని ఫిర్యాదు

తమ భూమికి సంబంధించిన వన్‌బీ, అడంగల్‌లో విజయ్‌కుమార్ అనే వ్యక్తి తన పేరు మార్చుకున్నాడని పునబాకకు చెందిన రెడ్డిపల్లి దొరస్వామి ఆర్డీవో కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ తనకు గ్రామంలోని సర్వే నంబర్ 210/24లో 20 సెంట్లు, 360/20లో 20 సెంట్లు, 372/5బీలో 94 సెంట్ల భూమి వుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో 2023 వరకు తన పేరుతోనే ఉన్నట్టు పేర్కొన్నారు. అప్పటి వీఆర్వో సుధాకర్ ముడుపులు తీసుకుని వన్‌బీ, అడంగల్‌లో పేరు మార్చినట్టు వాపోయారు. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, సర్వంచ్ పెంచలయ్య, వీఆర్వోలు మొబీనా, తేజ, రమణయ్య, సర్వేయర్ పూజిత పాల్గొన్నారు.

మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థన

నాయుడుపేట టౌన్ : అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ శుక్రవారం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా అబూబకర్ మాట్లాడుతూ విమాన ప్రమాదంలో అనేక మంది మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు అల్లా మనోధైర్యం ప్రసాదించాలని కోరారు. పట్టణంలోని జామియా, మమీర్‌షావలీ, మక్కా మసీదు, నూర్ మసీదులో సంతాపం తెలుపుతూ ప్రార్థనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తడ: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ మురళీ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

16న మామిడి ఫలసాయం వేలం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని 170 మామిడి ఫలసాయాన్ని ఈ నెల 16వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 8919395957లో సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ సంచాలకులుగా నాగార్జున సాగర్



నాయుడుపేట టౌన్ : నాయుడుపేట డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా ఎం.నాగార్జున సాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వెంకటగిరి నుంచి నాయుడుపేటకు బదిలీపై వచ్చారు. ఆయనను నాయుడుపేట, పెళ్లకూరు, కోట, చిట్టమూరు, వాకాడు మండలాల వ్యవసాయాధికారులు కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. డివిజన్ పరిధిలోని పలు విషయాలను ఏడీఏ అడిగి తెలుసుకున్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

అంగన్‌వాడీ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

నాయుడుపేట టౌన్ : అంగన్‌వాడీ నాయుడుపేట ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయుడుపేట ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సమీక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానం చేశారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కమిటీ అధ్యక్షురాలిగా రూపాదేవి, ప్రధాన కార్యదర్శిగా నెలవల శ్యామలమ్మ, ట్రెజరర్‌గా మేరీ ప్రమీల, గౌరవ అధ్యక్షులుగా శివకవి ముకుంద, ప్రాజెక్టు కమిటీ సభ్యులుగా సంధ్యారాణి, కళావతి, విజయ నిర్మల, జానకమ్మ, నవనీత, ప్రవీణ, ఉష, సింధూజ తదితరులు ఎన్నికయ్యారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- జగనన్న సైన్యంలా పోరాడదాం
- వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి

సైదాపురం: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో యువతకు పెద్ద పీట వేసి పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని ఎస్‌జేఆర్ భవనంలో 25 వార్డులకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ యువతకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అక్రమ కేసులకు భయపడొద్దని, వైఎస్సార్ సీపీ విజయం సాధించేంత వరకు జగనన్న సైన్యంగా పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి వార్డులోనూ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి స్థాయిలో వ్యతిరేకత మొదలైందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్లు కందాటి కళ్యాణి, వహీద, సుభన్య, ఎంఏ నారాయణ, సుబ్బారావు, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల కన్వీనర్లు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకురెడ్డికి పరామర్శ



వెంకురెడ్డితో మాట్లాడుతున్న నేదురుమల్లి

రాపూరు: మండలంలోని గిలకపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కేతా అనీల్‌కుమార్‌రెడ్డి తండ్రి వెంకురెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని వెంకురెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ దందోలు లక్ష్మినారాయణరెడ్డి, మండల కన్వీనర్ బొద్దు మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య



నవాబుపేటలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో సునందన

రాపూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో సునందన తెలిపారు. మండలంలోని నవాబుపేట, ఇందిరా కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక పాల్గొన్నారు.

చిట్టమూరులో మోస్తరు వర్షం

చిట్టమూరు: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాసింది. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. చెరువులకు తెలుగు గంగ నీరు సక్రమంగా రాకపోవడంతో ఎడగారులో సాగు చేసిన వరి పైరు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు కురిసిన వర్షం వల్ల కొంత మేర మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. తాడిమేడు, ఈశ్వరవాక, బయ్యవారికండ్రిగ, అరవపాళెం, ఆరూరు, చిట్టమూరు, మెట్టు, గునపాడు, గునపాటిపాళెం, తిమ్మారెడ్డివాగు, జంగాలపల్లి, ఎల్లసిరి గ్రామాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వృద్ధుడు మృతి

చిల్లకూరు : మండలంలోని బల్లవోలు సమీపంలో ఉన్న సిలికా గుంతల్లో గురువారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లిన వృద్ధుడు మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బల్లవోలుకు చెందిన తోట రామక్రిష్ణ(65) సిలికా గుంతల వద్ద వల వేసి చేపలు పడుతూ ఉంటాడని తెలిపారు. గురువారం సాయంత్రం వల తీసుకుని చేపల వేటకు వెళ్లినట్టు పేర్కొన్నారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారని వెల్లడించారు. అతను వల తీసుకుని వెళ్లినట్టు స్థానికులు చెప్పడంతో సిలికా గుంతల్లో వెతికారని వివరించారు. రాత్రి చీకటి కావడంతో ఇంటికి వచ్చేశారని, శుక్రవారం ఉదయం మృతదేహం నీటిపై తేలిందన్నారు. మృతదేహాన్ని వెలికితీసి గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, ఎస్సీ గురుకుల పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ రామయ్య తనిఖీ చేశారు. భోజనం నాణ్యత, పిల్లలకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్ళూరుపేట : 90102 23710

సాక్షి తిరుపతి

శనివారం । 14 । జూన్ । 2025



తోతాపురి.. ఇప్పుడు కొనం !

తోతాపురి మామిడికి టన్ను రూ.12 వేలు చెల్లించాలని కలెక్టర్ ఆదేశించినా కొనలేమని చేతులెత్తేస్తున్నారు. - 8లో



క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ తెలిపారు. - 8లో



సీట్లు 25 వేలు.. అభ్యర్థులు 22 వేలు

ఏపీ పీజీసెట్‌కు హాజరైన ప్రతి ఒక్కరికీ సీట్లు కేటాయించినా ఇంకా 3 వేల సీట్లు మిగిలి పోనున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

పాఠశాల రద్దుపై ఆందోళన



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఏ పార్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేయడంపై శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలలోనే ఆందోళనకు దిగారు. మా బడి మా ఊర్లోనే ఉండాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల రద్దు చేసి 2 కిలోమీటర్ల దూరంలోని పీవీకండ్రిగ పాఠశాలలో విలీనం చేశారని మండిపడ్డారు. ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాలను రద్దు చేయకూడదని తీర్మానం ఇచ్చినా రద్దు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ప్రారంభిస్తున్న వీసీ, కన్వీనర్, పరిశీలకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ పీజీ సెట్‌-2025లో భాగంగా శుక్రవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఎంపీఈడీ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థుల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో వీసీ అప్పారావు, కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు వెరిఫికేషన్‌ను ప్రారంభించారు. ఈ ప్రక్రియ రెండు రోజులు జరగనుంది. పరిశీలకులుగా నాగార్జున వర్సిటీ నుంచి ప్రొఫెసర్ పాల్, కృష్ణదేవరాయ వర్సిటీ నుంచి ప్రొఫెసర్ శ్రీనివాస్, యోగివేమన వర్సిటీ నుంచి ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, ఎస్వీయూ నుంచి ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి వ్యవహరించనున్నారు.

బ్యాంకు రుణాలకు ప్రాధాన్యం ఇవ్వండి

తిరుపతి అర్బన్ : బ్యాంక్ నుంచి రుణాలు ఇవ్వడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వాలని చెప్పారు. అలాగే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు పంట రుణాలు ఇవ్వాలని తెలిపారు. విద్యా రుణాలు ఇప్పించాలని సూచించారు. రుణాలు మంజూరు చేయడంలో పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి గిరిధర్, ఎల్‌డీఎం రవికుమార్, యూనియన్ బ్యాంక్ అధికారి సామంచి శర్మ, నాబార్డ్ డీడీఎం సునీల్, డీఆర్డీఏ పీడీ శోభన్ బాబు, మెప్మా పీడీ రవీంద్ర పాల్గొన్నారు.

వైద్యసేవలకు గ్రహణం

జిల్లాలో వైద్యసేవలకు గ్రహణం పట్టుకుంది. అత్యవసర వైద్యం అందక ఏ ఒక్కరూ తనువు చాలించకూడదన్న సంకల్పానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. గ్రామీణ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మేడిపండు చందంగా మారాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో గడప వద్దకే అందించిన వైద్య సేవలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని పట్టించుకోక పోవడంతో అత్యవసర సర్వీసులు నిర్వీర్యమయ్యాయి.

- ఏడాదిగా 108, 104 సేవలు నిర్వీర్యం
- మొక్కుబడిగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు
- వేధిస్తున్న మందుల కొరత
- నిలిచిపోయిన ఇంటింటి వైద్యం
- వైఎస్సార్‌సీపీ హయాంలో గడప వద్దకే వైద్యసేవలు



శిథిలావస్థకు చేరిన 108 వాహనాలు



తిరుపతి తుడా : తిరుపతి జిల్లాలో అత్యవసర సర్వీసులు నిర్వీర్యమవుతున్నాయి. ప్రమాదం జరిగితే కుయ్..కుయ్.. అంటూ నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని ప్రాణాలను రక్షించే 108 సంజీవిని...గ్రామీణ సంచార వైద్య సర్వీసు 104...ప్రసవించిన తల్లీబిడ్డను క్షేమంగా గమ్యం చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రభుత్వం వివిధ ఏజెన్సీల ద్వారా నిర్వహిస్తోంది. వీటి నిర్వహణ లోపం కారణంగా అత్యవసర సర్వీసులకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ సర్వీసులకు అవసరమైన నిధులను కేటాయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తద్వారా వీటి నిర్వహణ భారంగా మారుతోంది. సకాలంలో వాహనాల మరమ్మతులు చేయించలేని దుస్థితి ఏర్పడింది. చాలీచాలని వేతనాలతో డ్రైవర్ల కొరత వేధిస్తోంది.

108కు ఎదురు చూడాల్సిన పరిస్థితులు

జిల్లాలో 33 మండలాలకు 108 వాహనాలు 33, అర్బన్ ప్రాంతాలలోనూ, హైవేలకు కలిపి మొత్తం 41 వాహనాలు ఉండగా స్పేర్ వాహనం ఒకటి సేవలు అందించాల్సి ఉంది. నిర్వహణ లోపం కారణంగా 12 వాహనాలు తుప్పు పట్టే స్థితికి చేరుకున్నాయి. ప్రధానంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంటతో పాటు మరో 9 మండలాల పరిధిలోని 108 వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి హైవేలో తరచూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగుతుంటాయి. అలాంటి ముఖ్యమైన ప్రదేశాలలోని వాహనాలు చిన్న పాటి మరమ్మతులకు గురైనా వాటిని పట్టించుకోకుండా చేతులెత్తేశారు. ఆ ప్రాంతాలలో ప్రమాదం జరిగితే మరో ప్రాంతం నుంచి వాహనం వచ్చే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో ఉన్న 108 వాహనాలకు నిబంధనల మేరకు మొత్తం డ్రైవర్లు 103 మంది, టెక్నీషియన్లు 103 మంది ఉండాల్సి ఉంది. అయితే 31 మంది సిబ్బంది కొరత వేధిస్తోంది. సరైన వేతనాలు లేకపోవడం, పని ఒత్తిడి, వాహనాలను నడిపే పరిస్థితి లేకపోవడంతో సిబ్బంది ముందుకు రావడం లేదు. ప్రస్తుతం 108 డ్రైవర్లకు రూ.18 వేలు, టెక్నీషియన్లకు రూ.15 వేలు చెల్లిస్తున్నారు. సేవలకు తగినట్లు వేతనాలు ఇవ్వడంలేదన్న అసంతృప్తి సిబ్బందిలో నెలకొంది. ఇటీవల 108 సిబ్బంది ఆందోళన బాట పట్టడంతో దిగొచ్చిన ప్రభుత్వం అదనంగా రూ.4 వేలు చొప్పున పెంచేందుకు ముందుకు వచ్చింది. అయితే ఇప్పటికీ అమలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలానే 104 డ్రైవర్లకు రూ.16 వేలు, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కేవలం రూ.7,800 మాత్రమే ప్రభుత్వ చెల్లిస్తోంది. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు 26 ఉండగా కేవలం 19 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. డ్రైవర్ల కొరతతో 7 వాహనాలు షెడ్డుకే పరిమితమయ్యాయి.

జిల్లా వైద్య సర్వీసుల వివరాలు

సర్వీసు పేరు	వాహనాల సంఖ్య
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ మొత్తం	26
ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్నవి	19
మరమ్మతులకు గురైనవి	7
104	33
ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి	25
మరమ్మతులకు గురైనవి	8
108	41
108 స్పేర్ వాహనాలు	1
అందుబాటులో ఉన్నవి	30
మరమ్మతులకు గురైనవి	12

వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్య రంగానికి మహర్దశ



గత వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. వైద్యరంగ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులు తీసుకొచ్చారు. వైద్యులు, సిబ్బంది, వైద్య సదుపాయాలను సమకూర్చడంలో రాజీలేని నిర్ణయాలను అమలు చేశారు. ఉన్నత కుటుంబాలకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పేదలకు వర్తింపజేశారు. అలానే ఆరోగ్య సురక్ష పేరుతో ఇంటి వద్దకే వైద్య సేవలను అందించిన ప్రభుత్వంగా దేశంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చరిత్ర కెక్కింది. హెల్త్ సెంటర్లలో ఆధునిక వైద్య పరికరాలు, 200కు పైగా మందులు, ల్యాబ్‌లను సమకూర్చారు. అలానే 108 సేవలను బలోపేతం చేసి విస్తరించారు. వేతనాలను డిమాండ్ మేరకు నాడు పెంచి ప్రోత్సహించారు. వాహనాలు మరమ్మతులకు గురైన వెంటనే రిపేర్లు చేయించి పటిష్టమైన వ్యవస్థను అమలు చేశారు. ఇదే స్థాయిలో 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను మరింత మెరుగ్గా అమలు చేసి ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలను అందించారు.

తల్లీబిడ్డ సేవలకు విఘాతం



అరకొరగా సేవలందిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం తరువాత పురిటి బిడ్డతో పాటు తల్లిని సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే ఈ వాహనాల నిర్వహణను ప్రస్తుతం కూటమి ప్రభుత్వ విస్మరించింది. అరకొర వేతనాల కారణంగా డ్రైవర్ల కొరత వేధిస్తోంది. దీనికి తోడు వాహనాల నిర్వహణను గాలికి వదిలేయడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటిని నడపలేని పరిస్థితులు, వేతనాల లేమితో డ్రైవర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్నత లక్ష్యంతో తీసుకొచ్చిన తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలకు విఘాతం కలుగుతోంది.

104కు నిర్వహణలోపం



మరమ్మతులకు నోచుకోక మూలకు చేరిన 104 వాహనాలు

జిల్లాలో 33 గ్రామ సంచార వైద్య సేవలందించే 104 వాహనాల నిర్వహణలోపం గ్రామీణ ప్రాంత పేదలకు శాపంగా మారింది. పల్లె ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు, వ్యాధులపై అవగాహన కల్పించేందుకు గతంలో ప్రభుత్వాలు 104 సర్వీసును తీసుకొచ్చాయి. కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక పేదల వైద్యంపై చిన్నచూపు చూస్తోంది. వైద్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు అనాసక్తి చూపుతోంది. ఈ క్రమంలో పేదల ఆసుపత్రుల్లో మందులు సైతం సమకూర్చలేని దయనీయ స్థితికి వైద్య సేవలను దిగజార్చేశారు. దీంతో గ్రామీణ సంచార వైద్య సేవలందిస్తున్న 104 సేవలకు చంద్ర గ్రహణం పట్టుకుంది. వాహనాలలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన మందులు, ఇతర వైద్య సామగ్రిని సమకూర్చలేని దయనీయ స్థితికి ప్రభుత్వం చేర్చింది.

ఫోన్ చేస్తే ప్రత్యక్షమయ్యేది..



జగనన్న ప్రభుత్వ హయాంలో 108కు కాల్ చేస్తే చాలు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకునేది. శ్రీకాళహస్తి రేణిగుంట రహదారిలో స్కూటర్‌పై నేను మా తమ్ముడు వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. వెంటనే 108కు కాల్ చేశాం. నిమిషాల్లో వచ్చి మా ప్రాణాలను కాపాడింది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రైవేటు అంబులెన్స్‌లను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– లక్ష్మీప్రియ, గృహిణి, రేణిగుంట

వైద్యులు ఇంటికే వచ్చేవారు



వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్యులు ఇంటికే వచ్చి పరీక్షలు నిర్వహించేవారు. విలేజ్ క్లినిక్‌లలో పెద్దాసుపత్రులలో దొరికే మందులు, చికిత్స అందించేవారు. స్కానింగ్‌లు సైతం గ్రామీణ పీహెచ్‌సీ సెంటర్లలో అందుబాటులో ఉండేవి. నిరంతరం రాత్రి పగలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం విలేజ్ క్లినిక్‌లలో అలాంటి పరిస్థితి లేదు.

– శ్రీలత, గృహిణి, వెంకటగిరి

మందులు లేవంటున్నారు



104 వాహనాలు అరుదుగా గ్రామాలకు వస్తున్నాయి. గతంలో క్రమం తప్పకుండా వచ్చేవి. ప్రతి ఇంటి తలుపు తట్టి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేవారు. ప్రస్తుతం 104 వాహనాలు సక్రమంగా రావడం లేదు. వైద్య సేవల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవ్వా తాతలు వ్యయ ప్రయాసలకోర్చి పెద్దాసుపత్రులకు వెళ్తున్నారు.

– రమణయ్య, తిరుపతి రూరల్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పట్టణాలకే..



జిల్లాలోని ప్రధాన ఆసుపత్రులకే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను పరిమితం చేశారు. మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలు చిన్నపట్టణాలలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి డెలివరీ అయితే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉండటం లేదు. డిచ్చార్జ్ అయిన వారు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కోసం ప్రస్తుతం వేచి చూసే పరిస్థితి ఉంది.

– లీలావతమ్మ, సత్యవేడు

వైద్య సేవలు గతంలా లేవు



గత ప్రభుత్వ హయాంలో ఉన్న విధంగా ప్రస్తుతం వైద్యసేవలు అందడం లేదు. ఆరోగ్యశ్రీ పేరు చెబితేనే ప్రైవేటు ఆసుపత్రులలో వెనక్కి పంపుతున్నారు. జగనన్న ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు పెంచి సేవలు అందించారు. పెద్ద ఆపరేషన్లు చేయించుకుని మూడునెలల పాటు నెలకు రూ.5 వేల చొప్పున ఖర్చులకు అందించిన ఘనత వైఎస్ జగనన్నకే దక్కుతుంది.

– సుదర్శన్‌రెడ్డి, తిరుపతి

వలస జీవులపై మృత్యుపంజా!

వలస జీవులపై మృతువు పంజా విసిరింది. అభంశుభం తెలియని పురిటిబిడ్డను పొట్టనబెట్టుకుంది. మాటలు కూడా రాని మరో చిన్నారిని చిదిమేసింది. కుటుంబానికి ఆదరువుగా ఉంటుందనుకున్న చదువుల తల్లిని దూరం చేసింది. చిన్నాన కర్మక్రియలకు వచ్చి వెళ్తున్న ఓ అభాగ్యురాలిని అనంతలోకాలకు పంపేసింది. ఆమె ఇద్దరు బిడ్డలను అనాథలను చేసింది. మరొకరు సొంత పనిమీద బెంగళూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలోనే మింగేసింది. గురువారం రాత్రి కర్ణాటకలో జరిగిన ఈ ఘటన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

- కర్ణాటక రాష్ట్రం హోస్కోట్ వద్ద ఘోర ప్రమాదం
- ఘటనలో ఐదుగురు మృతి
- మృతులు తిరుపతి, చిత్తూరు జిల్లా వాసులు
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు






హోస్కోట్ వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం, (ఇన్‌సెట్) రోదిస్తున్న తులసీ తల్లి



మృతి చెందిన చిన్నారి ప్రణతి



మృతి చెందిన తులసి, శారద (ఫైల్)



కేశవులు రెడ్డి, చిన్నారి (ఫైల్)

కార్వేటినగరం: బెంగుళూరులో ఉపాధి కోసం వెళుతూ కానరాని లోకాలకు చేరుకున్నారు. మరో 20 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరుకునే లోపే లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాఢ నిద్రలోనే అనంతలోకాలకు పంపేసింది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రంలోని హోస్కోట్ వద్ద గురువారం వేకువ జాము 2 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. చిత్తూరు డిపోకు చెందిన బస్సును లారీ ఢీకొట్టడంతో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 45 రోజుల చిన్నారితో సహా ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. మృతుల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన నలుగురు, తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ఒకరు ఉన్నారు. స్థానికుల కథనం .. గంగాధరనెల్లూరు మండలం, పాపిరెడ్డిపల్లె పంచాయతీ, మారేడుపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి భార్య శారద(40) బెంగళూరులో నివాసముంటోంది. తన చిన్నాన కర్మక్రియల కోసం స్వగ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో అశువులు బాసింది. అలాగే తూంగుండ్రం గ్రామానికి చెందిన లక్ష్మీకరుణాకర్‌కుమార్ చిత్తూరు డిపో-2లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సొంత పనిమీద బెంగళూరు వెళ్తా తీవ్రంగా గాయపడ్డారు. వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు గ్రామానికి చెందిన కే.కేశవులురెడ్డి, అతని తమ్ముడు జానర్ధన్‌రెడ్డి, తల్లి పాపమ్మ, భార్య గిరిజ, ఇద్దరు పిల్లలు కలిసి బెంగళూరులోనే నివాసముంటున్నారు. సొంత పనిమీద స్వగ్రామానికి వచ్చి తిరుగుపయనమయ్యారు. హోస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో కేశవులురెడ్డి(45) మృతి చెందగా అతని తమ్ముడు జనార్ధన్‌రెడ్డి కుమారుడు 45 రోజుల చిన్నారి మృత్యువాతపడ్డాడు. మిగిలిన క్షతగాత్రులు హోస్కోట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నచ్చుకూరు గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, భార్య ధనలక్ష్మి, కుమారుడు జస్వంత్ సొంత పనిమీద బెంగళూరుకు వెళ్తా గాయపడ్డారు. ఇందులో ధనలక్ష్మికి రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శ్రీరంగరాజపురం మండలం, కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన తులసీ(22) ఉద్యోగాన్వేషణలో భాగంగా బెగళూరులో శిక్షణ తీసుకుంటూ.. గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందింది.

'ప్రణతి' రోదన!

అలాగే తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం, తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన హరిబాబు, రోహిణి దంపతులు కుమార్తె ప్రణతి(4) మృతి చెందింది. హరిబాబు బెంగళూరులోని ఆర్మీలో పనిచేస్తున్నారు. తన భార్యతో కలిసి స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది.

అమ్మానాన్న పిలుపే కరువైంది

గంగాధరనెల్లూరు మండలం, ఆళ్లమడుగు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. గ్రామానికి చెందిన 45 రోజుల చిన్నారితో సహా వారి పెద్ద నాన్న కేశవులురెడ్డి మృతి చెందారు. ఎన్నో నోములు నోసి.. పుట్టిన పురిటి బిడ్డను ఆ దేవుడు అమ్మానాన్న అని పిలవకముందే దూరం చేశాడంటూ.. ఆ తల్లి గుండెలు బాదుకుంటూ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ఆశల దీపం ఆరిపోయింది

కొడుకులు లేరన్న బెంగలేకుండా కుమార్తెను అల్లారుముద్దుగా పెంచి పోషించిన మా ఇంటి దీపం ఆరిపోయిందని మృతురాలు తులసీ తల్లిదండ్రులు విలపించడం కలచివేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన తులసీ, ఉద్యోగాన్వేషణలో భాగంగా బెంగళూరు వెళ్లి శిక్షణ తీసుకుంటోంది. హోస్కోట వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు వదిలింది.

చిన్నాన్న కర్మక్రియల కోసం వచ్చి..

జీడీనెల్లూరు మండలం, మారేడుపల్లె గ్రామంలో గురువారం జరిగిన చిన్నాన్న సుబ్రమణ్యంరెడ్డి కర్మక్రియలకు శారద హాజరైంది. తర్వాత బెంగళూరుకు బయలు దేరింది. ఆమె భర్త విశ్వనాథరెడ్డి బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శారద ఇంట్లో పనులతో పాటు పిల్లల సంరక్షణ చూసుకుంటోంది. హోస్కోట్ ఘటనలో శారద మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహాలు

హోస్కోట్ ప్రమాదంలో మృతి చెందిన ఆళ్లమడుగు గ్రామానికి చెందన కేశవులురెడ్డి(45), ఆయన తమ్ముడి కుమారుడు 45 రోజుల చిన్నారి మృత దేహాలు శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్నాయి. చిన్నారిని చూసిన గ్రామస్తులు బరువెక్కిన గుండెతో రోదించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోండి



శ్రీరంగరాజపురం : కర్ణాటక రాష్ట్రం, హోస్కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.50 లక్షలు అందించాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు అందించాలన్నారు. శుక్రవారం పుత్తూరులోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మృతిచెందిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సుప్రీం తీర్పు కూటమికి చెంపపెట్టు



కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు విషయంలో సుప్రీం కోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంజీవయ్య మాట్లాడారు. ప్రశ్నించే గొంతును నొక్కే విధంగా కక్ష పూరిత రాజకీయ నిర్ణయాలను సమాజం కాని న్యాయస్థానాలు హర్షించవన్నారు. పత్రికాస్వేచ్ఛను కాలరాసే విధంగా చేస్తున్న దాడులు, దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వానికి సుప్రీం తీర్పు కనువిప్పు కావాలని సంజీవయ్య హితవు పలికారు.



క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

దొరవారిసత్రం : ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తనియాలి గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. తనియాలి గ్రామంలో గురువారం మధ్యాహ్నం సమయంలో మృతుడు బ్యాగ్‌తో సంచరిస్తూ ఓ ఇంటి వద్ద అన్నం తిన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ సమీపంలోని కాళంగి నది ఒడ్డున ఉన్న సంపద తయారీ కేంద్రంలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బ్యాగ్‌ను పరిశీలించగా మృతుడి ఆధార్ కార్డు ఆధారంగా అంజప్పగారి ఈశ్వరప్ప(45) అనంతపురం జిల్లా, బ్రహ్మసముద్రం మండలం, గుండిగానిపల్లి గ్రామానికి చెందినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అనంతపురం ప్రాంతంలో ఐసీఐసీఐ బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతుడికి మతిస్థిమితం లేకపోవడంతో 2015 నుంచి చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి రికార్డుల బట్టి తెలుస్తున్నట్లు చెప్పారు. భార్య టీచర్‌గా పని చేస్తోందన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి ఇంటిలో చెప్పకుండా 10వ తేదీ నుంచి కనిపించకుండా పోయారని బంధువులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మురళీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తొట్టంబేడు : గల్లంతైన పెరిమిడి మురళి మృతదేహం తెలుగు గంగ కాలువలో శుక్రవారం నీటిపై తేలింది. గురువారం స్నానానికి కాలువలో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ప్లాటు డాక్యుమెంట్స్ దారిపోయినది
(డాక్యుమెంట్ నెం: 3083/1984)
సెల్ : 9989033100

తోతాపురి.. ఇప్పుడు కొనం!

- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- కిలో రూ.8కి కొనుగోలు చేయాలంటున్న అధికారులు
- రూ.3 నుంచి రూ. 6 కొనుగోలు చేస్తామంటున్న ఫ్యాక్టరీలు
- పది రోజుల్లో నగదు ఇవ్వాలంటున్న అధికారులు
- ఎప్పుడిస్తామో చెప్పలేమంటున్న ఫ్యాక్టరీలు
- కొద్ది రోజులు ఆగితే వర్షాలతో రాలిపోతాయంటున్న రైతులు
- జాయింట్ కలెక్టర్ జోక్యంతో సాగుతున్న చర్చలు

జిల్లా సమాచారం	
మామిడి సాగు	60 వేల ఎకరాలు
మామిడి రైతులు	28,654 మంది
రానున్న దిగుబడి	3.75లక్షల టన్నులు
అందులో తోతాపురి దిగుబడి	2 లక్షల టన్నులు



తోతాపురి మామిడి

తిరుపతి అర్బన్ : మామిడి రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కొనుగోలుదారులు లేకపోవడంతో కోయకుండా అలానే ఉంచుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు చుట్టుముడుతున్నాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం వస్తుందనే ఆందోళన అన్నదాతలను వెంటాడుతుంది. తోతాపురి రకం మామిడిని టన్ను రూ.12 వేలకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే తోతాపురి టన్ను రూ.12 వేలకు కొనుగోలు చేయలేమని పరిశ్రమ నిర్వాహకులు తేల్చిచెబుతున్నారు.

రైతులకు నగదు ఎప్పుడిస్తారో స్పష్టత లేక..

సాధారణంగా ఏదైనా సరుకును ఇలా విక్రయిస్తే ....అలా నగదు ఇవ్వడం తెలిసిందే. అయితే పది రోజుల్లోపు అధికారులు మామిడి రైతులకు కొనుగోలు చేసిన సరుకుకు నగదు ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం ఆ విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు...కొందరు ఆరు నెలలు సమయం పడుతుందంటున్నారు...మరి కొందరు ఎప్పుడి ఇస్తామో చెప్పడం లేదు...ఈ సంఘర్షణలో రైతులు అల్లాడిపోతున్నారు. మరోవైపు సర్కార్ టన్నుకు రూ.4 వేలు ఇస్తామని చెబుతున్నప్పటికీ ఆ మొత్తం ఎప్పుడిస్తారో అర్థం కావడం లేదు. దీంతో రైతులు సతమతమతున్నారు.

తర్వాత కొనుగోలు చేస్తాం..

తక్కువ ధరలు ఇస్తామని ఫ్యాక్టరీలు యాజమాన్యం చెబుతున్న సంగతి పక్కన పెడితే...ప్రస్తుతం కొనుగోలు చేయలేమని పలువురు ఫ్యాక్టరీలు చెబుతున్నాయి. కొద్ది రోజులు ఆగండి తర్వాత చూద్దామంటున్నారు. ఓ వైపు మామిడి పంట కోతకు వచ్చేసింది. వెంటనే కోయాల్సి ఉంది. అయితే కొద్ది రోజులు ఆగమని చెబుతున్నారు. ఎన్ని రోజులు ఆగాలో తెలియడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అకాల వర్షాలు నేపథ్యంలో పెద్దగాలులు వస్తే మామిడి పంట మొత్తం రాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులకు వర్షాల టెన్షన్ తప్పడం లేదు.

కొనుగోలుపై జేసీ జోక్యం

జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మామిడి పంటను రైతుల నుంచి ఫ్యాక్టరీలు తప్పకుండా కొనుగోలు చేయాలని పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సమావేశాల్లో చర్చించినట్లుగా టన్ను రూ.8 వేల చొప్పున కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. తక్కువ ధరకే తమిళనాడు నుంచి మామిడి వస్తుందని చెప్పడాన్ని తప్పుపడుతున్నారు. కొద్దిరోజుల తర్వాత కొనుగోలు చేస్తామని చెబితే కుదరదని....కోతకు వచ్చిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం మాత్రం దిగిరావడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెప్పాలని మొర పెట్టుకుంటున్నారు.

ముందే దిగుబడి తగ్గిపోయింది



ఎప్పుడులేని విధంగా ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గింది. సాధారణంగా ఎకరం మామిడి తోటకు తోతాపురి సాగు చేస్తే 4 నుంచి 6 టన్నులు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఎకరానికి అర్ధ టన్ను మాత్రమే దిగుబడి వస్తుంది. మరోవైపు ఏటా మార్చిలోనే కోతకు వచ్చే పంట ఈ ఏడాది జూన్‌లో వస్తోంది. ఇంకోవైపు ధరలు ఉండడం లేదు. కొనుగోలు చేసేవారు కరువయ్యారు. సర్కార్ రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాసులురెడ్డి, మామిడి రైతు, బుచ్చినాయుడుకండ్రిగ మండలం

ఫ్యాక్టరీలు కొనుగోలు చేయడం లేదు



అధికారులు పదే పదే చెబుతున్నా...ఫ్యాక్టరీలు మాత్రం మామిడి పంటను స్థానికంగా కొనుగోలు చేయడం లేదు. అయితే ఫ్యాక్టరీ వద్ద లారీల కొద్ది తోతాపురి మామిడి సరుకు వచ్చి దిగుతోంది. తమిళనాడు నుంచి వస్తోంది. దీంతోనే ఫ్యాక్టరీలు కొద్దిరోజులు ఆగండి అంటున్నారు. ఎన్నిరోజులు ఆగాలో తెలియడం లేదు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

–ధర్మయ్య, మామిడి రైతు, బీఎన్ కండ్రిగ మండలం

ఈసారి పెట్టుబడులు ఎక్కువ



ఈసారి దిగుబడి బాగా తగ్గింది. అయినా కొనుగోలు చేసేవారు లేరు. ఈసారి పెట్టుబడులు ఎక్కువ అయ్యాయి. మామిడి పూత పదేపదే రాలిపోతుంటే దాన్ని కాపాడుకోవడం కోసం పదేపదే మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. అయితే రేట్లు లేవు. దీంతో ఏం చేయాలో తెలియడం లేదు. మామిడి కంటే వేరే పంటలు సాగు చేసి ఉంటే బాగుండేదని భావిస్తున్నాం.

– రాజేష్, మామిడి రైతు, పాకాల మండలం

మామిడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం ఈ ఏడాది మామిడి రైతులను ఆదుకోవాల్సి ఉంది. ఎప్పుడు లేని కష్టాలు మామిడి రైతులకు ఈ ఏడాది చోటు చేసుకున్నాయి. ప్రభుత్వమే మామిడిని కొనుగోలు చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవు. ఫ్యాక్టరీల నుంచి కొనుగోలుపై స్పష్టత లేదు. దీంతో రైతులు అంతా డోలాయమానంలో పడ్డారు. రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– అత్తిరాల సురేష్, మామిడి రైతు, కేవీబీపురం మండలం

బ్యాంకు ఖాతాను అనుసంధానం చేయించాలి

తిరుపతి అర్బన్ : షెడ్యూల్డ్ కులాలకు చెందిన 9, 10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ విద్యార్థులు తల్లికి వందనం స్కాలర్ షిప్ కోసం తమ బ్యాంక్ ఖాతాను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)అనుసంధానం చేయించాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు లేదా బ్యాంక్ లేదా పోస్టల్ అధికారులను సంప్రదించి చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఆ మేరకు హాస్టల్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పిస్తామని ఆయన వెల్లడించారు. 9,10 తరగతుల విద్యార్థుల వారి తల్లి బ్యాంక్ ఖాతాకు, ఇంటర్ విద్యార్థులు అయితే వారి బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేయించాలని స్పష్టం చేశారు. ఒకవేళ బ్యాంక్ అకౌంట్ లేకపోతే పోస్టల్‌లో అయినా కొత్త ఖాతాను తెరిచి ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించాలని వివరించారు.

యోగాంధ్రపై టెలీకాన్ఫరెన్స్



వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన శుక్రవారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. శనివారం జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాలు, నగరాల్లో యోగాంధ్ర ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఇందులో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 17న శ్రీకాళహస్తి, 18న తిరుపతిలో 5 వేల మందితో కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. 19వ తేదీన సూళ్లూరుపేట నియోజకవర్గ బీవీ పాలెంలో యోగాంధ్ర క్యాంపెయిన్ చేపట్టనున్నట్టు తెలిపారు.

బావిలో మునిగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

జయలక్ష్మీపురంలొ ఘటన



మృతుడు విజయ్

కేవీబీపురం : స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో మునిగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృత్యువాత పడిన ఘటన కేవీబీపురం మండలం జయలక్ష్మీపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన కసపర్తి విజయ్‌కుమార్ (27) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉరుసు ఉత్సవాలకు గ్రామానికి వచ్చిన యువకుడు ఈత రాకపోయినా స్థానిక శివారులోని వ్యవసాయ బావిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో తల్లిదండ్రుల బోరున విలపించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

తిరుపతి క్రైం : హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం ఎమ్మార్ పల్లి సమీపంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచిగా సేవలు అందించి అధికారుల వద్ద మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. దొరికే సమయంలో కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డ్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతులరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్జీటీల బదిలీలు



అబ్జర్వర్‌గా విచ్చేసిన ఆర్జేడీ శామ్యూల్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు పరిధిలోని ఎస్జీటీల బదిలీలు శుక్రవారం ప్రశాంతంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో సీరియల్ నం.1001 నుంచి 2000 వరకు ఎస్జీటీల బదిలీల కసరత్తు నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు చిత్తూరు అబ్జర్వర్‌గా విచ్చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయంలో పలువురు టీచర్ల అర్జీలను స్వీకరించి పరిష్కరించదగ్గ వాటిని పరిష్కరించారు. ఈ కౌన్సెలింగ్ కసరత్తులో చిత్తూరు డీఈవో వరలక్ష్మి, తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, డీవైఈవోలు పాల్గొన్నారు.

నోషనల్ తేదీ బాధితులు ఫిర్యాదు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2008 డీఎస్సీలో ఉద్యోగాల్లో చేరిన టీచర్లు హామీ పత్రాల ప్రకారం పాఠశాలలో చేరారు. వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి వేర్వేరు తేదీల్లో పాఠశాలల్లో చేరినప్పటికీ సీనియారిటీ, మానిటరీ బెనిఫిట్స్ అందరికీ ఒకే తేదీ రోజు వర్తించేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. సంబంధిత టీచర్లు నోషనల్ తేదీని, పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని టీఐఎస్ (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో నమోదు చేశారు. అయితే బదిలీలకు దరఖాస్తు చేసుకునే సమయంలో పాఠశాల విద్యాశాఖ సూచనల ప్రకారం నోషనల్ తేదీ కేవలం ఉద్యోగోన్నతులకు మాత్రమేనని, పాఠశాలల్లో విధుల్లో చేరిన రోజునే బదిలీలకు పరిగణిస్తామని స్పష్టంగా తెలియజేశారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు సైతం ఇచ్చారు. బదిలీల్లో నోషనల్ తేదీ విషయంలో నష్టపోయిన పలువురు టీచర్లు ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి న్యాయం చేయాలని అర్జీ అందజేశారు.

ఇష్టానుసారంగా దరఖాస్తుల్లో నమోదు

2008 డీఎస్సీ టీచర్లు తమకు ఇష్టానుసారంగా నోషనల్ తేదీని బదిలీల దరఖాస్తుల్లో నమోదు చేసుకున్నారు. మరికొంత మంది పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని నమోదు చేశారు. ఈ సమస్యపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పదే పదే స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొంత ఎంఈవోలు అమలులో అలసత్వం వహించారు. దీని వల్ల కొంతమంది టీచర్లు బదిలీల్లో లబ్ధిపొందేందుకు ఉద్దేశపూర్వకంగా నోషనల్ తేదీనే కొనసాగించుకున్నారు. దీంతో నోషనల్ తేదీని నమోదు చేసుకున్న టీచర్లు బదిలీల సీనియారిటీ జాబితాల్లో ముందుకు వెళ్లిపోయారు. నిజంగా పాఠశాలల్లో విధుల్లో చేరిన తేదీని నమోదు చేసుకున్న టీచర్లు జాబితాలో వెనుకకు వచ్చేసి తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన బాధిత 2008 డీఎస్సీ టీచర్ల సమస్యలను ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ ఆర్జేడీ శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 150 మంది టీచర్లు లబ్ధిపొందారని ఆర్జేడీకి జాబితా సమర్పించగా, ఆ జాబితా ప్రకారం విచారణకు ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS
ఇంటర్మీడియట్ తప్పక పాస్ కావాలన్న విద్యార్థులు తిరుపతి నందు గల SLV జూనియర్ కాలేజ్ లో ఉద్యోగ అవకాశాలుగల Nursing+BiPC, MLT +BiPC, CSE+MPC గ్రూప్‌లో చేరండి. బాల/బాలికలకు హాస్టల్ వసతి కలదు. 95503 10199.

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

FLAT FOR SALE
తిరుపతిలో మానస సరోవర్ హోటల్ దగ్గర 3 BHK ఫ్లాట్ అపార్ట్‌మెంట్‌లో అమ్మకమునకు కలదు. సంప్రదించండి సెల్: 85265 29999.

HOUSE FOR SALE
తిరుపతిలో 27 అం. గల ఈస్ట్ ఫేసింగ్ డూప్లెక్స్ హౌస్ ఫర్‌సేల్ టీటీడీ ఫ్లాట్స్, నియర్ బాష్యం స్కూల్, న్యూ బాలాజీ కాలనీ, సంప్రదించండి: 8128691234.

LAND FOR SALE
2.5 Acres Land Suitable for Farm Land / Villas / Layout. 20 Minutes from Tirupati and 100 Meters from National Highway (NH) 205 Chennai Renigunta Highway. Contact Cell: 9445253860.

PLOT FOR SALE
తిరుపతిలో కనిపిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన అగ్రావ్ ఫామ్ ల్యాండ్ లో 7 సం.ల ఎర్ర చందనం చెట్లతో సహా రిజిస్ట్రేషన్ చేయబడును. డైరెక్ట్ ఓనర్. 9502774175, 7995992114.

తిరుపతిలో లీలామహల్ సర్కిల్ దగ్గర 33 అంకణములు గల వెస్ట్ ఫేసింగ్ సైట్ ఫర్ సేల్. సంప్రదించండి సెల్: 8526529999.

Wanted

నగరి పరిసర ప్రాంతాల్లో గల కన్‌స్ట్రక్షన్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్. 15,000/-, SO, 18,000/-, Gunman, 22,000/- Ex Army. 9908281928.

Full Time Primary Teachers (Hin, Sci & SpokenEnglish)& PartTime Higher Teachers (Biology&IITMaths),Tutors(Evening) Akshara HighSchool,Nawabpet ,Tpt. 9490027704.

తిరుపతి TCL మరియు హోటల్స్, షోరూమ్స్ పరిసరాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు (స్టాఫ్) కావలెను. భోజనము, రూం సౌకర్యము కలదు. 9100578607.

ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు శ్రీ సిటీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ, జీతం : 18,000/- (వసతి సౌకర్యం కలదు) ఫోన్ : 91108 39912, 89192 51217.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ :18K. Ph: 8520980099, 8520874499

PRO Required-UmaDevi Educational Consultancy. For admissions in Chennai Universities & Colleges. B.Tech, B.Sc & Medical Courses - HIGH EARNING, performance-driven role. 9959954507

ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th - డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239

రేణిగుంట / కరకంబాడిలో పనిచేయడానికి సెక్యూరిటీ గార్డులు కావలెను. నెలకు జీతం. 14000/ 8 గం. ఉచిత గది, ESI, PF కలవు. రేణిగుంట బస్టాండ్ దగ్గరకు 17-06-2025న ఉ. 10 గం.లకు ఇంటర్వ్యూకు హాజరు కావలెను. Cell: 83410 38715, 891 960 6707

గమనిక

వాణిజ్యేతర ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970

సీట్లు 25 వేలు.. అభ్యర్థులు 22 వేలు

- ఏపీ పీజీ సెట్‌కు ఆదరణ కరువు
- భారీ స్థాయిలో పడిపోతున్న పీజీ ప్రవేశాలు
- వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకమేనా..!

తిరుపతి సిటీ : ఏపీ పీజీ సెట్‌కు ఆదరణ తగ్గుతోంది. గతేదాడి ఉన్న సీట్లకన్నా అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాల్లో ఏపీ పీజీ సెట్–2025 నిర్వహించగా 25,688 మంది దరఖాస్తు చేసుకున్నారు. 21,995 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అన్ని వర్సిటీల్లోనూ పీజీ కోర్సుల్లో 25 వేల సీట్లు ఉన్నాయి. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ప్రతి ఒక్కరికీ 1 : 1 ప్రాతిపదికన సీట్లు కేటాయించినా 3 వేల సీట్లు మిగిలిపోనున్నాయి. వర్సిటీల్లో భారీ స్థాయిలో పడిపోతు్న పీజీ ప్రవేశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

సీట్లు 25 వేలు.. హాజరైన అభ్యర్థులు 22 వేలు

ఈ ఏడాది ఏపీ పీజీ సెట్‌కు హాజరైన అభ్యర్థులు, రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీల్లో 31 పీజీ సబ్జెక్టుల్లో సీట్ల భర్తీ సంఖ్యను చూస్తే ఆశ్చర్యమేస్తోంది. అన్ని పీజీ కోర్సుల్లో సీట్ల సంఖ్య 25 వేలు ఉండగా పీజీ సెట్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య 22 వేలకు మించకపోవడం గమనార్హం. గణాంకాలను బట్టి 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు భారీ స్థాయిలో పడిపోతున్నట్లు స్పష్టమవుతోంది. తద్వారా వర్సిటీల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని మేధావి వర్గాలు, విద్యానిపుణులు చెబుతున్నారు.

పరిశోధన రంగంపై తీవ్ర ప్రభావం

పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పడిపోవడం ద్వారా పరిశోధన రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్‌సెట్‌కు ఈ ఏడాది దరఖాస్తులు తగ్గే అవకాశం ఉంది. ఆధునిక యువత టెక్నికల్, మెడికల్ రంగం వైపు మొగ్గు చూపడం, యూజీ పూర్తి చేసిన వెంటనే ఉపాధి, ఉద్యోగావకాశాలను దక్కించుకోవాలనే లక్ష్యంతో యువత అడుగులు వేయడంతో పీజీలో ప్రవేశాలు తగ్గుతున్నాయి. రీసెర్చ్ రంగంపైనా యువత పెద్దగా ముగ్గు చూపలేకపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉన్నత విద్యకు యువత దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పీజీసెట్-2025 వివరాలు

కోర్సులు	పీజీ సెట్‌కు వచ్చిన దరఖాస్తులు	హాజరైన అభ్యర్థులు
కెమికల్ సైన్స్	6070	5396
లైఫ్ సైన్స్	4027	3641
కంప్యూటర్	2333	1858
కామర్స్	1438	1203
ఇంగ్లీష్	898	721
హ్యూమానిటీస్	883	736
జువాలజీ	1548	1347
గణితం	1175	983
ఫిజిక్స్	938	808
బోటనీ	1295	1146
మిగిలిన అన్ని కోర్సులకు	5083	4156
మొత్తం	25,688	21,995

పైసలిస్తే.. ఎక్కడికైనా బదిలీ!



- నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శుల బదిలీలు
- రేటు కొద్దీ పోస్టింగ్‌లు ఇచ్చారని విమర్శలు
- జిల్లా స్థాయి అధికారి కుటుంబికులే కలెక్షన్ ఏజెంట్
- బదిలీలపై పెద్ద ఎత్తున చెలరేగిన విమర్శలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : 'ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు రానే వచ్చాయి.. ప్రభుత్వం కార్యదర్శుల బదిలీలకు రేటు కొద్దీ పోస్టింగ్.. మమ్మల్ని ఆపేదెవరు.. అడిగేదెవరు.. ఇక గ్రేడ్‌ల విషయం అంటారా.. అది ఎలాగో పాటించడమే లేదు.. ఏరకమైన ఆరోపణలు వచ్చినా డోంట్ కేర్..'' అంటూ నిసిగ్గుగా బదిలీలు చేసేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులుగా పనిచేస్తూ కాసులకు కక్కుర్తిపడి పంచాయతీల్లో అనుభవం లేని వారికి అందల మెక్కిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

తిరుపతి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో అంతా గందరగోళం నెలకొంది. చాలా గ్రామ పంచాయతీల్లో బదిలీలైన కార్యదర్శులకు గడువు తీరకున్నా, పదవీ విరమణ చెందుతున్నా లెక్క చేయకుండా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. తమకు బదిలీ రాదని అనుకున్న వారంతా బదిలీ అయ్యే పరిస్థితి రావడంతో మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను ఎక్కడా అమలు చేయకుండా ఇష్టానుసారం బదిలీలు చేయడంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా తిరుపతి శివారు ప్రాంతాలైన తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శుల బదిలీల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందన్న ఆరోపణలు బదిలీ ఉత్తర్వులు తీసుకున్న కార్యదర్శుల నుంచే వ్యక్తమవుతున్నాయి. ప్రతి సీటుకు ఓ రేటు ఫిక్స్ చేసి మరీ వసూలు చేసినట్లుగా బదిలీల్లో అన్యాయం జరిగిన కార్యదర్శులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం కేంద్రంగా జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జిల్లా స్థాయి అధికారులకు కాసుల వర్షం కురిపించిందని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి.

ముడుపులకే ప్రాధాన్యం

బదిలీల ప్రక్రియ ప్రారంభం నుంచే పంచాయతీ కార్యదర్శులు అధికార పార్టీ నేతల చుట్టూ తిరగడం, ఆపై స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు పట్టుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడం.. అప్పటికీ అనుకున్న చోటకు పోస్టింగ్ రాకుంటే అడిగినంత సమర్పించుకుని పోస్టింగ్ తెచ్చుకోవడం వంటి పనులన్నీ చకచకా జరిగిపోయాయన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే బదిలీ ఉత్తర్వులు చేతపట్టుకున్న కొంత మంది పంచాయతీ కార్యదర్శులు అనుకున్న చోటుకు వచ్చిందని సంబరపడ్డా అనుకోని విధంగా పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించాల్సి వచ్చిందని మదనపడుతున్నారు. పలు చోట్ల బదిలీ రాదులే అనుకుని తీరిగ్గా కూర్చున్న వారికి ఆ స్థానం కోరుకున్న మరొక వ్యక్తికి కట్టబెట్టడం కోసం నిబంధనలను పక్కన పెట్టి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేసినట్లు సమాచారం. రాజకీయ ఒత్తిళ్లను సైతం లెక్కచేయకుండా కాసులకు ప్రాధాన్యం కల్పించి మరీ బదిలీలు జరిగినట్లు ఆరోపణలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి.

సమగ్ర విచారణ చేపట్టాలని..

ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకుని పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీ ఉత్తర్వులు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రారంభం నుంచే కలెక్షన్లు

పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ప్రారంభం నుంచే ఆ శాఖకు చెందిన జిల్లా అధికారి కలెక్షన్లకు తెరలేపినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో సీటుకు ఓ రేటు ఫిక్స్ చేసుకుని ఉత్తర్వులు జారీ చేసినట్లుగా కాసులు ఇచ్చిన కార్యదర్శులే విమర్శలు చేస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. బదిలీల్లో కలెక్షన్ ఏజెంట్లుగా జిల్లా స్థాయి అధికారి కుటుంబీకులే రంగంలోకి దిగినట్లుగా ఆరోపిస్తున్నారు. ఇక డిప్యూటీ ఎంపీడీవోల బదిలీల్లోనూ అలాగే జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.